క్లుప్తంగా

యోగా అభివృద్ధికి కృషి



మాట్లాడుతున్న అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్

కర్నూలు (టౌన్): జిల్లాలో యోగా క్రీడను పాఠశాల స్థాయి నుంచి అభివృద్ధి చేయడమే లక్ష్యమని జిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివరాజ్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జిల్లా స్థాయి అంతర్ పాఠశాలల యోగా ఎంపిక పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాస్థాయిలో యోగా అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించినట్లు చెప్పారు. యోగా పోటీల నిర్వహణకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పోటీల రాష్ట్ర పరిశీలకులు బాల సుబ్రమణ్యం మాట్లాడుతూ.. జిల్లాలో యోగా అభివృద్ధికి వ్యాయామ ఉపాధ్యాయులు కీలక పాత్ర వహించాలన్నారు. జిల్లా ప్రైవేటు వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు చిన్న సుంకన్న, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వక కలయిక



జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిసిన ఆదోని సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్

కర్నూలు(సెంట్రల్): ఆదోని సబ్ కలెక్టర్‌గా నియమితులైన మౌర్య భరద్వాజ్ మంగళవారం జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషాను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆయన్ను కలిసి పూల మొక్కను అందజేశారు. అనంతరం సబ్ డివిజన్‌లోని పరిస్థితులను కలెక్టర్‌కు వివరించారు.

మసీదు స్థలాన్ని పరిరక్షించాలి



సునీల్‌కన్నాకు వినతి పత్రం అందిస్తున్న ఆవాజ్, మసీదు కమిటీ సభ్యులు

కర్నూలు(అర్బన్): నగరంలోని అతి పురాతనమైన బూడాన్‌ఖాన్ మసీదు స్థలాన్ని పరిరక్షించాలని ఆవాజ్ కమిటీ కార్యదర్శి ఎస్ఎండీ షరీఫ్, మసీదు కమిటీ సభ్యులు ఇస్మాయిల్, యాకూబ్ కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి సునీల్ కన్నాను కలిసి వినతి పత్రం అందించారు. వారు మాట్లాడుతూ.. కొందరు రాజకీయ నాయకులు అధికార బలంతో సబ్ రిజిస్ట్రార్లపై ఒత్తిడి తెచ్చి మసీదు స్థలాన్ని అక్రమంగా రిజిస్టర్ చేసుకోవడం జరిగిందన్నారు. ఆక్రమణదారులపై, తప్పుడు రిజిస్టర్ చేసిన వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే భూ ఆక్రమణలు, తప్పుడు రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆర్‌యూ అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

కర్నూలు కల్చరల్: రాయలసీమ విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా జరిగిన, జరుగుతున్న అక్రమాలు, అవకతవకలు, అవినీతిపై ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.చంద్రప్ప డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయంలో నిబంధనలకు విరుద్ధంగా నాన్ టీచింగ్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింపజేసి అక్రమంగా జీతభత్యాలు మంజూరు చేస్తున్నారన్నారు. విద్యార్థుల సంక్షేమానికి విశ్వవిద్యాలయ అభివృద్ధికి ఖర్చు పెట్టాల్సిన నిధులు ఏడాదికి రూ.3 కోట్లు విశ్వవిద్యాలయ అధికారులు దుర్వినియోగం చేస్తున్నారని విమర్శించారు.

పందుల కోసం డస్ట్‌బిన్‌లు ధ్వంసం



ధ్వంసమైన డస్ట్‌బిన్

కర్నూలు(హాస్పిటల్): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ఇటీవల ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్‌లను కొందరు ధ్వంసం చేశారు. ఆసుపత్రిలోని సర్జికల్ బ్లాక్ వద్ద ఏర్పాటు చేసిన డస్ట్‌బిన్ ధ్వంసం కావడంతో సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి ఆవరణలో గైనిక్, పీడియాట్రిక్, ఓపీ బ్లాక్, సర్జికల్, డయాగ్నోస్టిక్ బ్లాక్ విభాగాల వద్ద రోగుల కోసం సిమెంట్ డస్ట్‌బిన్‌లను ఇటీవలే ఏర్పాటు చేశామని, వాటిని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై విచారణ చేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీని కోరినట్లు చెప్పారు. కొందరు వ్యక్తులు ఆసుపత్రి ఆవరణలోకి పందులను వదిలి వాటికి ఆహారం కోసం సిమెంట్ డస్ట్‌బిన్‌లు పగులగొడుతున్నట్లు అనుమానాలు ఉన్నాయన్నారు. రాత్రిపూట డ్యూటీ చేసే సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, సెక్యూరిటీ గార్డులపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిని సస్పెండ్ చేయాలని ఆదేశించారు.

రైతుబజారులో దళారుల దందా

- ప్రజాప్రతినిధుల అండతో రెచ్చిపోతున్న దళారులు
- రైతులకు బెదిరింపులు
- బోర్డుపై రాసిన ధరలను పట్టించుకుంటే ఒట్టు
- ఇష్టారాజ్యంగా ధరలు పెంచేసి అమ్మకాలు



రైతుబజారులో కూరగాయలు విక్రయిస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): రైతుబజార్లలో బోర్డుపై రాసిన ధరలకే కూరగాయలను అమ్మాల్సి ఉంటుంది. అయితే కర్నూలు సీ.క్యాంపు రైతుబజారులో బోర్డుపై రాసిన ధరలను పట్టించుకునే వారు ఉండరు. ఇష్టానుసారంగా ధరలు పెంచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. రైతులు తాము పండించిన కూరగాయలు, ఆకుకూరలను తెచ్చుకొని అమ్మకోవాలనేది రైతుబజారు లక్ష్యం. అయితే రైతుబజారులో వెదికినా రైతులు కనిపించరు. అసలైన రైతులు కొందరు ఉన్నా.. వారికి స్టాళ్లు లభించవు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, రెక్కలు వంచి కష్టం చేసి పండించిన రైతులు ఎక్కడో మూలన కింద కూర్చొని కూరగాయలు అమ్ముకుంటుంటే దళారులు మాత్రం దర్జాగా స్టాళ్లలో కూర్చొని కూరగాయలు అమ్ముకుంటున్నారు. దళారులను మార్కెటింగ్ శాఖ అధికారులు, కలెక్టర్, జేసీ వంటి ఉన్నతాధికారులు కూడా ఏమీ చేయలేని పరిస్థితి. రైతులకు నిలయం కావాల్సిన రైతుబజారులో ప్రజాప్రతినిధులే దళారులను ప్రోత్సహిస్తున్నారు. రైతుబజారు నిండా దళారులే నిండిపోవడంతో వారు బోర్డుపై ఉన్న ధరలను పట్టించుకున్న పాపాన పోవడం లేదు. ధరలను పెంచేసి అమ్మకాలు సాగిస్తున్నారు. నిత్యం అధిక ధరలకు కూరగాయల అమ్మకాలపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నా చర్యలు లేకపోవడం గమనార్హం. రాష్ట్రంలోని టాప్–5లో ఒకటిగా ఉన్న కర్నూలు సీ.క్యాంపు రైతుబజారు దళారులు తిష్ట వేసిన వాటిలో కూడా టాప్–5లో నిలుస్తోంది. ఇదిలాఉండగా మరో రూ.2 కోట్లతో రైతుబజారును విస్తరించడానికి రంగం సిద్ధమైంది.

దళారులదే హవా..

రైతుబజారులో దళారుల హవా కొనసాగుతోంది. వారంతా ఏకమై రైతులపై బెదిరింపులకు దిగుతున్నారు. మీరు తెచ్చిన కూరగాయలను మాకు అమ్మకొని వెళ్లండి. ఇక్కడే అమ్ముకుంటామంటే స్థానం దొరకదు. ఎక్కడో మూలన కూర్చోవాల్సిందే. అక్కడికి కొనుగోలుదారులు వచ్చే అవకాశం ఉండదని బెదిరిస్తున్నట్లు సమాచారం. దీంతో దళారులకు, రైతులకు గొడవలు నిత్యం సర్వసాధారణమయ్యాయి. దళారులకు ప్రజాప్రతినిధుల అండ ఉండడంతో అధికారులు చూస్తూ ఉండిపోవడం మినహా చేసేది ఏమీ లేకుండా పోయింది. ఎప్పుడైనా ఒకరిద్దరు దళారులను బయటికి పంపితే ప్రజాప్రతినిధులతో రెకమెండ్ చేయించుకొని 10 నిమిషాల్లో లోపలికి వస్తున్నారు. దళారుల పెత్తనం కారణంగా రైతుబజారుకు రైతులు దూరం అవుతున్నారు. మొత్తం దళారులతో నిండిపోవడంతో ధరలను అడ్డగోలుగా పెంచి అమ్మకాలు సాగిస్తున్నా చర్యలు తీసుకునే అవకాశం లేకుండా పోయింది.

అల్లం అమ్మకాల్లో దందా

సి.క్యాంపు రైతుబజారులో అల్లం అమ్మకాల్లో దందా సాగుతోంది. రైతుబజారు సెక్యూరిటీ సిబ్బందే ఈ దందా సాగిస్తున్నారనే ఆరోపణలున్నాయి. అందువల్లనే అల్లం అమ్మకాల్లో బోర్డుపై రాసిన ధరలను ఎవ్వరు పట్టించుకోరు. జిల్లా రైతులు పండించని అల్లం, బంగాళదుంప వంటి కూరగాయలను పొదుపు మహిళలు కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో కొనుగోలు చేసి అమ్ముకోవచ్చు. అయితే రైతుబజారు సెక్యూరిటీ సిబ్బంది హోల్‌సేల్ మార్కెట్ నుంచి అల్లం కొనుగోలు చేసి తీసుకొచ్చి ఇటు పొదుపు మహిళలకు, అటు మరి కొందరు దళారులకు సరఫరా చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి. అల్లం ద్వారా వచ్చే ఆదాయాన్ని కొందరు సిబ్బంది పొందుతున్నట్లు తెలుస్తోంది. అల్లం అమ్మకాల్లో రైతుబజారు సిబ్బంది కారణంగానే దందా సాగుతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. అల్లం కిలో ధర బోర్డుపై రూ.78 ఉండగా ఈ ధరకు అమ్మేవారు ఒక్కరు కూడా కనిపించరు. కిలో రూ.100 ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. దీనిపై వినియోగదారులు ఫిర్యాదు చేసినా పట్టించుకోరనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. బోర్డుపై క్యాబేజీ కిలో ధర రూ.20 ఉండగా రూ.30 ప్రకారం అమ్మకాలు సాగిస్తున్నారు. క్యారెట్‌లో రెండు రకాలు ఉన్నాయి. రూ.44/60 ధరలు ఉన్నాయి. రూ.44 క్యారెట్‌ను సైతం రూ.60 ప్రకారమే విక్రయించి జేబులు నింపుకుంటున్నారు.

బోర్డు ధరకే విక్రయించాలి

రైతుబజారులో బోర్డుపై రాసిన ధరల ప్రకారమే కూరగాయలు విక్రయించాలి. అధిక ధరలకు అమ్మే వారిపై చర్యలు తీసుకుంటాం. రైతుబజార్‌లో రైతులకు మాత్రమే స్థానం ఉంటుంది. దళారులకు స్థానం లేదు. అల్లం దందాపై విచారణ జరిపిస్తాం. – నారాయణమూర్తి, సహాయ సంచాలకులు, మార్కెటింగ్ శాఖ

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కర్నూలు (అగ్రికల్చర్): విద్యుత్ లైన్ల మెయింటెనెన్స్ పనులు చేపడుతున్న కారణంగా బుధవారం కర్నూలులోని కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఆ శాఖ ఏడీ రాజేంద్రబాబు తెలిపారు. డి2 సబ్ డివిజన్ క్యాంపస్ సెక్షన్ పరిధిలోని సి.క్యాంప్, గణేష్ నగర్, శ్రీరాం నగర్, విజయ హాస్పిటల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో కోత విధిస్తున్నట్లు ఆయన మంగళవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పెట్రో ఉత్పత్తులను జీఎస్టీ పరిధిలోకి తేవాలి

కర్నూలు(సెంట్రల్): పెట్రో ఉత్పత్తులైన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేవాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. జాతీయ సమితి పిలుపు మేరకు మంగళవారం కర్నూలు అర్బన్ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్డీఏ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలను జీఎస్టీ పరిధిలోకి తేకుండా కాలయాపన చేస్తోందన్నారు. మరోవైపు పెట్రో ఉత్పత్తుల ధరలను నిరంతరం పెంచుకోవడానికి కంపెనీలకు అవకాశం ఇవ్వడంతో లీటర్ పెట్రోల్ రూ.110, లీటర్ డీజిల్ రూ.100, 14 కేజీల వంటగ్యాస్ సిలిండర్ ధర రూ.950 చేరాయన్నారు. దీంతో సామన్య, మధ్య తరగతి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో లేనిపోని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. పెట్రో ఉత్పత్తుల ధరలను తగ్గించేందుకు జీఎస్టీ పరిధలోకి తేవాలని కోరారు. నాయకులు గిడ్డమ్మ, జి.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రాజధానిపై పునరాలోచించాలి

- నిపుణుల కమిటీ హెచ్చరికలు బేఖాతరు చేస్తే మూల్యం తప్పదు
- ప్రత్యామ్నాయంగా కర్నూలును రాజధాని చేయాలి



మాట్లాడుతున్న ఆర్‌వీపీఎస్ అధ్యక్షుడు రవికుమార్

కర్నూలు సిటీ: ఏడాదికి మూడు పంటలు పండే అమరావతి ప్రాంతంలో రాజధాని ఏర్పాటు చేయవద్దని శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ కమిటీలు హెచ్చరించినా టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదని, అక్కడ ఈ రోజు ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయో అందరూ చూస్తున్నారని రాయలసీమ విద్యార్థి పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవికుమార్, రాయలసీమ హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు సుంకన్న వాపోయారు. మంగళవారం ఆర్‌వీపీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. రాజధాని ప్రాంతంలో తీవ్రమైన వరదలతో ప్రజలు అల్లాడుతున్నారని, రాష్ట్ర విభజన సమయంలో శ్రీకృష్ణ, శివరామకృష్ణన్ కమిటీలు సైతం అమరావతికి వరద ముంపు ఉంటుందని చెప్పినా టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదన్నారు. ఇలాంటి ప్రాంతంలో నిర్మాణాలు దృఢంగా ఉండవని చెప్పినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ కమిటీ నివేదికలను కనీసం పరిగణలోకి తీసుకోలేదన్నారు. ఆ కమిటీల సూచనలను పట్టించుకోని ఉంటే నేడు రాజధానికి ఈ పరిస్థితులు వచ్చేవి కాదని చెప్పారు. భవిష్యత్తులో మరిన్ని వరదలు వస్తే పరిస్థితులు ఇంకెంత దారుణంగా ఉంటాయో ఊహించుకుంటేనే భయం వేస్తోందన్నారు. ఇన్ని ప్రతికూలతలు కలిగిన రాజధానిపై పునరాలోచనలు చేయాలని, ప్రత్యామ్నాయంగా కర్నూలును రాజధానిగా చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు చుట్టుపక్కల ప్రాంతాల్లో 30 వేలకుపైగా ప్రభుత్వ భూములు ఉన్నాయని, మానవ తప్పిదాలు మినహా ఈ ప్రాంతానికి తుపాను, వరదల ముప్పు ఉండదని, నిర్మాణాలు సైతం అత్యంత దృఢంగా ఉంటాయని వివరించారు. ఇప్పటికైన సీఎం చంద్రబాబు నాయుడు, మంత్రులు రాజధాని విషయంపై పెద్దల చెప్పిన విషయాలను పరిగణలోకి తీసుకోవాలని, శ్రీబాగ్ ఒప్పందం మేరకు కర్నూలులో రాజధాని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఆ సంఘం నాయకులు అశోక్, వసంత్‌కుమార్, విజయ్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వెయిట్ లిఫ్టర్లకు ప్రశంసలు



పతకాలు సాధించిన క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

కర్నూలు (టౌన్): ఇటీవల అనకాపల్లిలో నిర్వహించిన అంతర్ జిల్లాల వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో కర్నూలుకు చెందిన వెయిట్ లిఫ్టర్లు ప్రతిభ చాటి పతకాలు సాధించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. కలెక్టరేట్‌లోని కార్యాలయంలో మంగళవారం జిల్లా కలెక్టర్‌ను విజేతలుగా నిలిచిన వెయిట్ లిఫ్టర్లు కలిశారు. వారిని కలెక్టర్ అభినందించారు. 61 కేజీలు, 55 కేజీల విభాగంలో వీరేష్ (బంగారు, వెండి, కాంస్యం), 81 కేజీలు, 61 కేజీల విభాగంలో అబ్దుల్లా (వెండి, కాంస్యం), నరసింహానాయక్ (కాంస్యం), ముష్రాఫ్ పర్వేజ్ (వెండి) వెంకటనాయుడు (కాంస్యం) పతకాలు సాధించారు. అలాగే సీనియర్ విభాగంలో రన్నరప్ ట్రోఫీ సాధించారు. జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి భూపతిరావు, అసోసియేషన్ కార్యదర్శి షేక్షావలీ (పాపా), వెయిట్ లిఫ్టింగ్ కోచ్ యూసుఫ్ పాల్గొన్నారు.

ప్రైవేటు పరం చేయొద్దు



మాట్లాడుతున్న పీఎస్ రాధాకృష్ణ

కర్నూలు(సెంట్రల్): డ్రైవింగ్ లైసెన్సుల జారీ, వాహన ఫిట్‌నెస్ పరీక్షలను ప్రభుత్వమే నిర్వహించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పీఎస్ రాధాకృష్ణ డిమాండ్ చేశారు. ఆయా కార్యకలాపాలను ప్రైవేట్‌కు అప్పగించడాన్ని సీఐటీయూ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని చెప్పారు. మంగళవారం సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం జారీ చేసిన మోటార్ వెహికల్ యాక్ట్ సవరణ బిల్లులో భాగంగా వాహనాల రిజిస్ట్రేషన్లు, ఫిట్‌నెస్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ ప్రక్రియను ప్రైవేట్‌కు అప్పగించే విధానాన్ని తక్షణమే రద్దు చేయాలన్నారు. ఉమ్మడి జిల్లా ఆర్‌టీఏ ఆఫీసులను అభివృద్ధి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరారు. అంతే తప్పా ఉన్న కార్యాలయాలను ప్రైవేట్‌కు అప్పగించి వారి నుంచి సేవలను పొందాలని ప్రజలకు సూచించడం అన్యాయమన్నారు. ఈ విధానం అమల్లోకి వస్తే ప్రైవేట్ వ్యక్తులు దోపిడీకి పాల్పడతారని, వారు చెప్పినంత మామూళ్లు ఇవ్వకపోతే పనులు చేయరని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని వ్యతిరేకిస్తూ ఈనెల 11వ తేదీన ఆర్‌టీఏ కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు తెలిపారు. నాయకులు కె.ప్రభాకర్, బి.రాధాకృష్ణ, హుస్సేన్‌వలి పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కల్లూరు: గర్భిణులు పౌష్టికాహారం తీసుకునేలా ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని రాష్ట్రీయ బాలస్వాస్థ కార్యక్రమ అధికారి డాక్టర్ హేమలత సూచించారు. మంగళవారం ఉలిందకొండ పీహెచ్‌సీలో నిర్వహించిన ఆశా డే కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పోషకాహార వారోత్సవాల గురించి, 17న నిర్వహించనున్న నులి పురుగుల నివారణ దినోత్సవం గురించి వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డాక్టర్లు రఘు, శ్రీధర్ రెడ్డి, ఆనంద్ రావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలి



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

కర్నూలు(సెంట్రల్): ఆశా వర్కర్లకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని సీఐటీయూ నగర కార్యదర్శి సీహెచ్ సాయిబాబా, సీపీఎం నగర కార్యదర్శి టి.రాముడు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న ఆశావర్కర్లు, సీఐటీయూ నాయకులు మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. ఈ సందర్భంగా కల్లూరు, కర్నూలులోని ముజఫర్ నగర్, షరీన్‌నగర్, ఇందిరాగాంధీ నగర్, ఇల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల మెడికల్ ఆఫీసర్లకు వినతిపత్రాలు ఇచ్చారు. వారు మాట్లాడుతూ.. జీతాల పెంపు, 60 ఏళ్లు నిండిన వర్కర్లకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, రాజకీయ వేధింపులు అరికట్టడం, పీహెచ్‌సీల్లో మహిళలకు రక్షణ తదితర అంశాలను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. ఆశా వర్కర్లు కృష్ణవేణి, రాణి, రేణుక, జ్యోతి, మహేశ్వరి, నాగేశ్వరి, మద్దమ్మ తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులకు నిత్యావసర సామగ్రి పంపిణీ

కర్నూలు కల్చరల్: కల్కి సేవా సమితి ఆధ్వర్యంలో విజయవాడ ముంపు ప్రాంత బాధితులకు నిత్యావసర వస్తువులను ప్రత్యేక వాహనంలో పంపారు. వాటర్ బాటిళ్లు, దుప్పట్లు, వివిధ రకాల నిత్యావసర వస్తువులు, తినుబండారాలు తదితర సామగ్రితో వాహనాన్ని మంగళవారం కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు జెండా ఊపి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న వారికి సహాయం చేయడం అభినందనీయమన్నారు. కల్కి సేవా సమితి వారు పంపే వస్తువులు బాధితులకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. వీరిని స్ఫూర్తిగా తీసుకొని మరికొన్ని స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు సాయం చేసేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. సేవా సమితి సభ్యులు మురళి, మోక్షేశ్వరుడు, వెంగన్న చౌదరి, తదితరులు పాల్గొన్నారు.

లక్ష వాటర్ ప్యాకెట్లు పంపిణీ

కర్నూలు (అర్బన్): భారీ వర్షాలు, తుపాను, వరదల కారణంగా తాగునీటి కోసం ఇబ్బంది పడుతున్న విజయవాడ వరద బాధితుల కోసం లక్ష వాటర్ ప్యాకెట్లను పంపుతున్నట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.నాగేశ్వరరావు తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన మాట్లాడుతూ.. తమ శాఖ ఈఎన్‌సీ ఆదేశాల మేరకు ప్రత్యేక వాహనంలో వాటర్ ప్యాకెట్లను పంపుతున్నట్లు వెల్లడించారు.

సహాయక చర్యలకు తరలిన బృందం

కర్నూలు (టౌన్): విజయవాడలో వరద సహాయక కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కర్నూలు కార్పొరేషన్ ఉద్యోగులు బయలుదేరి వెళ్లారు. మున్సిపల్ పరిపాలన శాఖ సంచాలకుల ఆదేశాల మేరకు ఇంజినీరింగ్ విభాగానికి చెందిన సూపరింటెండెంట్ ఇంజినీర్, ఇరువురు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, నలుగురు డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు, ఐదుగురు శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, 15 మంది సచివాలయాల ఉద్యోగులు, 100 మంది పారిశుద్ధ్య కార్మికులు వరద సహాయక విధుల్లో పాల్గొననున్నట్లు కార్పొరేషన్ వర్గాలు వెల్లడించారు.

సకాలంలో మందులు అందించాలి



మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు(హాస్పిటల్): ఆసుపత్రిలో చికిత్స పొందే రోగులకు సకాలంలో మందులు అందించాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. ఆసుపత్రిలోని ధన్వంతరి హాలులో మంగళవారం హెడ్ నర్సులు, వార్డ్ ఇన్‌చార్జ్ హెడ్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారికి కొన్ని మార్గదర్శకాలు, సూచనలు, సలహాలు అందించారు. ఏ విధంగా మందుల ఇండెంట్ పెడుతున్నారు, రోగులకు వైద్య పరీక్షలు సరిగా చేయిస్తున్నారా, ఆరోగ్యశ్రీ కేసులకు చికిత్స ఎలా అందిస్తున్నారని ఆరా తీశారు. ఆసుపత్రిలోని అన్ని విభాగాల్లో డ్రగ్ స్టోర్స్ రిజిస్టర్‌ను సరిగ్గా నిర్వహించాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ స్టాక్ రిజిస్టర్‌ను ప్రతిరోజూ పరిశీలించాలని డ్రగ్ స్టోర్ మెడికల్ ఆఫీసర్‌కు చెప్పారు. స్టాక్ రిజిస్టర్‌పై త్వరలో ఆకస్మిక తనిఖీ చేస్తానని చెప్పారు. సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, డిప్యూటీ సీఎస్ఆర్ఎంఓ డాక్టర్ హేమనళిని, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, స్టోర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద, నర్సింగ్ సూపరింటెండెంట్ ఎస్‌పీ సావిత్రిబాయి పాల్గొన్నారు.

ఆట్యా- పాట్యా క్రీడలో రాణించాలి



విజేతలుగా నిలిచిన కృష్ణగిరి, మంత్రాలయం, ఆదోని జట్ల క్రీడాకారులు

కర్నూలు (టౌన్): దక్షిణాసియా దేశాల్లో ప్రాచుర్యం కలిగిన ఆట్యా–పాట్యా క్రీడలో ప్రతిభ చాటాలని వీఆర్ హాస్పిటల్ అధినేత డాక్టర్ సి.వాసిరెడ్డి అన్నారు. స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో మంగళవారం జిల్లా స్థాయి ఆట్యా–పాట్యా పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశలో ఏదో క్రీడను ఎంచుకుని సాధన చేయాలన్నారు. తద్వారా ఒత్తిడిని అధిగమించి చదువు, క్రీడల్లో రాణిస్తారన్నారు. బాలుర పోటీల్లో విజేతలుగా సి.బెళగల్, జూపాడుబంగ్లా, పెద్దపాడు, బాలికల విభాగంలో విజేతలుగా కృష్ణగిరి, మంత్రాలయం, ఆదోని, నంద్యాల జిల్లా బాలబాలికల పోటీల్లో ఓర్వకల్, కమలపాడు, లక్ష్మాపురం జట్లు విజేతలుగా నిలిచాయి. ఆ సంఘం కార్యదర్శి బాల పవన్ పాల్గొన్నారు.

గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ



మాట్లాడుతున్న వైద్యాధికారిణి డాక్టర్ సాత్విక

కర్నూలు(హాస్పిటల్): గర్భిణుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని రకాల వైద్యపరీక్షలు, చికిత్స అందించాలని గడ్డ యూపీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ సాత్విక చెప్పారు. మంగళవారం స్థానిక గడ్డ వీధిలోని యూపీహెచ్‌సీలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సాత్విక మాట్లాడుతూ.. గర్భిణిగా తెలిసిన వెంటనే వివరాలు నమోదు చేయించి, రెగ్యులర్ వైద్యపరీక్షలు చేయించాలని, రక్తహీనత, థైరాయిడ్, మధుమేహం, రక్తపోటు పరీక్షలు, ఇంకా ఏవైనా జబ్బులపై అనుమానం ఉంటే ఆ పరీక్షలు చేయించాలని సూచించారు. ఎప్పుడెప్పుడు ఏఏ ఆహారం తీసుకోవాలో అవగాహన కల్పించాలని చెప్పారు. డెమో శ్రీనివాసులు మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

లంబోదరుని ప్రతిష్టకు ఏర్పాట్లు

నగరంలోని వీధుల్లో వినాయకుని మండపాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 7వ తేదీన వినాయకచవితి పండుగ సందర్భంగా వాడవాడలా భారీ విగ్రహాలను ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు పనులు ప్రారంభించారు. స్వామివారిని ప్రతిష్ఠించేందుకు పీఠం ఏర్పాటు, కర్రలు, టార్పాలిన్‌లతో టెంట్లు వేసి మండపాలను సిద్ధం చేస్తున్నారు. అలాగే రంగురంగుల కర్టెన్లు, విద్యుత్ దీపాలు, పూలతో మండపాలను అందంగా అలంకరిస్తున్నారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్, కర్నూలు



గాయత్రి ఎస్టేట్‌లోని మండపం వద్దకు విగ్రహాన్ని క్రేన్‌తో తరలిస్తున్న దృశ్యం



బిర్లాగేట్ సమీపంలోని మండపం



బుధవారపేట దుర్గమ్మ గుడి వద్ద మండపాన్ని సిద్ధం చేస్తున్న నిర్వాహకులు



మద్దూర్‌నగర్‌లో సిద్ధమైన వినాయక మండపం